క్లుప్తంగా

27న కొలాం నాయకుల సమావేశం

కైలాస్‌నగర్: కుమురం సూరు యువసేన, కొలాం సేవ సంఘం, కొలాం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న కోలాం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కుమురం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ చౌక్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మధ్నాహ్నం 2గంటలకు నిర్వహించే సమావేశానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న సభ్యులు

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గ్లోబల్ స్కూల్ టీం సభ్యులు ఇస్మాయిల్, ఆదిశ్రీలు బుధవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు, క్లాస్‌రూం అబ్జర్వేషన్, వర్మీ కంపోస్టు తయారీ, ఆర్గానిక్ పంటలను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన డాక్యుమెంటరీ తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

ఇంద్రవెల్లి: ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌హాల్‌లో యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావ్, పెందోర్ ప్రభాకర్, వెంకట్‌రావ్, గణేష్, జహీర్, నాగోరావ్, ఉత్తమ్, బావరాజ్, భగవాన్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

తలమడుగు: మండలంలోని లింగి సాయి వృద్ధాశ్రమంలో ఆదిలాబాద్‌లోని బ్యాంకు ఆఫ్ బరోడ సిబ్బంది నిత్యావసర సరుకులు అందజేశారు. క్యాక్రమంలో బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, నాగరాజు, విద్యా సాగర్, మహేష్ పాల్గొన్నారు.

కిసాన్‌మిత్ర హెల్ప్‌లైన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో కిసాన్‌మిత్ర హెల్ప్ లైన్‌పై 18001 203244 రైతులకు అవగాహన కల్పించారు. భూమి రికార్డులు, పంట రుణాలు, కౌలు రైతులు విత్తన సమస్యలు, మార్కెట్‌యార్డ్ ధరలు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం, మానసిక ఒత్తిడి, తదితర సమస్యల పరిష్కారం కోసం కిసాన్‌మిత్రను నంబరును సంప్రదించాలని కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్ కోరారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ భీమ్‌రావు, ఆత్రం సోనేరావు, కొడప రాజు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇచ్చోడ: తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐపీవో షాఫియోద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ పోస్టాఫీస్ ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో నాబార్డు గోదాంకు పక్కన కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వాటిని తొలగించాలని పొచ్చర గ్రామస్తులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. ఆక్రమించుకున్న స్థలాన్ని ప్రభుత్వం స్వాధీన చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సిబ్బంది కరువు

- వైద్యవిధాన పరిషత్‌లోకి వెళ్లినా.. కానరాని అభివృద్ధి
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని ప్రభుత్వం



బోథ్‌లోని సీహెచ్‌సీ ఆసుపత్రి పాత భవనం (ఫైల్)

బోథ్: బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ఆసుపత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వైద్యం చేసేందుకు సరిపడా సిబ్బంది లేక, వైద్య సదుపాయాలు లేక రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బోథ్‌లోని సీహెచ్‌సీని ప్రభుత్వం ఇటీవల వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకువచ్చింది. దీంతో ఆసుపత్రి స్థాయి పెరిగింది కానీ వసతులు మాత్రం మెరుగుపడలేదు. ప్రభుత్వం ఉదాసీనతతో ఆసుపత్రి స్థాయి పెరిగినా.. సరిపడా సిబ్బంది, వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

13 మందే సిబ్బంది..

వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులతో పాటు అనుబంధ సిబ్బందిని నియమించాలి. 32 మంది సిబ్బంది ఉండాలి. కానీ బోథ్‌లోని సీహెచ్‌సీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. స్పెషాలిటీ వైద్యుడు, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. సివిల్ అసిస్టెంట్ వైద్యులు 11 మంది ఉండాలి. కానీ ఇక్కడ కేవలం ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఇద్దరు డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. హెడ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. 10 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా.. 3గురు మాత్రమే ఉన్నారు. అందులో ఒకరు రెగ్యులర్ కాగా, మరో ఇద్దరు డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. మొత్తం 32 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం 13 మంది మాత్రమే ఉన్నారు.

సౌకర్యాలు లేక..

బోథ్ సీహెచ్‌సీలో పరిధిలో దాదాపు లక్షా 20 వేల మంది జనాభా ఉంటుంది. దీంతో ప్రతీరోజు చాలా మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. ప్రధాన ఆసుపత్రిలో ఉండాల్సిన పరికరాలు లేవు. ఎక్స్‌రే ప్లాంట్, బ్లడ్‌బ్యాంకు, వెంటిలేటర్ సౌకర్యాలు లేక ఆసుపత్రి సాధారణ ఆసుపత్రిలాగా పని చేస్తోంది. ఇటీవల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 కోట్ల 50 లక్షలు కేటాయించింది. ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో డాక్టర్లు సైతం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం



బోథ్ ఆసుపత్రిలో సౌకర్యాల గురించి అధికారులకు విన్నవించాం. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వైద్యులు, సిబ్బంది నియామకం కోసం ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది.

– రాజనాల రవీంద్ర ప్రసాద్, వైద్యులు

ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలి

బోథ్ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. సీహెచ్‌సీ ఆసుపత్రిగా ఉండి ఎటువంటి సౌకర్యాలు లేవు. ప్రతీ విషయానికి రిమ్స్‌కు రిఫర్ చేయాల్సి పరిస్థితి నెలకొంది.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జైనథ్: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని ఖాప్రి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొంతమంది నాయకులు ఆలయం పేరుతో ఓట్లు దండుకునే పనిలో ఉన్నారని ఆరోపించారు. అనంతరం గ్రామంలోని మాల సంక్షేమ సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.50 లక్షలతో నిర్మించనున్న గీత మందిరం కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. అలాగే నంద మైసమ్మ ఆలయానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బీజేపీ ఒక్క రామ మందిరం నిర్మించి, ఓట్లు అడగటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సర్సన్ లింగారెడ్డి, సర్పంచ్ ఎల్.రమీల వెంకటరెడ్డి, మెట్టు ప్రహ్లాద్, రామ్ రెడ్డి, ప్రశాంత్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ చేసేందేమి లేదు

బేల: బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని బాది గ్రామంలో కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి, వంటగది, సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. బీజేపీ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కరని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, శాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీష్ పవార్, దంతెల వినోద్, తన్వీర్ ఖాన్, గోడం సునీల్, వైద్య కిషన్, బెదుర్‌కార్ సంతోష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

నేరడిగొండ: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి అన్నారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం 2023ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని కుమారి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. అరికెలు, రాగులు, సజ్జలు, సామలు, కొర్రలు, ఎండు కొర్రలు, ఉదలు, జొన్నల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గడ్డం భీంరెడ్డి, సర్పంచ్ ఓర్స రాజు యాదవ్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, ఎంపీటీసీ సవిత చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి బిగ్రు భాస్కర్, ఏఈవోలు సాయి కీర్తన, సౌజన్య, జైపాల్, గజేందర్ పాల్గొన్నారు.

‘అభివృద్ధికి నోచుకోని నాగోబా’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం, నాయకులు హామీలు ఇవ్వడం తప్పా.. చే సింది ఏమీ లేదని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత ఆరోపించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కోటి రుపాయలతో నిర్మించిన స్టేడియం ఎక్కడ ఉంటే చెప్పాలన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని చెప్పి ఆదివాసీలను మోసం చేస్తునారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను, ఎంపీ సోయం బాపురావును విమర్శించే అర్హత మంత్రికి లేదన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ వ్యక్తిగత విమర్శలు మానుకొని, అభివృద్ధి దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీజేపీ స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్ షెకవత్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు మోరే దిలిప్, మడావి భీంరావ్, ముండే రాజు, మస్కే రాజువర్ధన్, గిరిధర్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

ఖానాపూర్: పరీక్షా పే చర్చలో భాగంగా బుధవారం పట్టణంలోని శాంతినగర్ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర హైస్కూల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9,10 తరగతులకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సందుపట్ల శ్రావణ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు ఎనుగందల రవి, ఇనుముల స్వామి, సుధాకర్, సాయికృష్ణ, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

సిరికొండ: బీఆర్ఎస్‌తోనే దేశంలో సంక్షేమ పాలన వస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని లెండిగూడ, వాయిపేట్ గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ లక్ష్మి, నాయకులు రాథోడ్ బిక్కునాయక్, షేక్ బషీర్, సునీల్, దినేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరికొండ: మండల కేంద్రంలోని ఆర్ఎంపీల మండల కార్యవర్గం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు రామోజీ వీరాచారి బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పించి, సర్టిఫికెట్స్ జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భోజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి శంకర్, కావాటి రమేష్, గజానంద్, లక్కం మల్లేష్, ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాల్గోవ తరగతి ఉద్యోగులు

ఇంద్రవెల్లి: గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న నాల్గోవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు బీసీ వెల్ఫర్, సోషల్ వెల్ఫర్‌లో హెచ్‌డబ్ల్యూవోలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. పీటీలు, శానిటేషన్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెందోర్ మల్కు, సభ్యులు వినయ్, కనక కమల, పెందోర్ జంగు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన యువతి అదృశ్యమైంది. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఇచ్చోడలోని డిగ్రీ కళాశాలకు వెళ్లగా.. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు.

ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో రేకుల షెడ్‌ను జేసీబీతో ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నార్నూర్ మండలానికి చెందిన స్వప్నిల్ తన చిన్నమ్మ వనిత 2008లో తాటిగూడలోని ప్లాట్ నం.63ను గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇరవై ఏళ్ల క్రితం రేకుల షెడ్ నిర్మించుకున్నాడు. కాగా ఈనెల 22న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన భూమయ్య, సందీప్, ప్రవీణ్ పంతుళ్లు అనే ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రేకుల షెడ్డును ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం విద్యానగర్‌లో శ్రీలక్ష్మీ రెసిడెన్సీ పక్కన పేకాడుతున్న వారిని టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



ఇచ్చోడ: అవగాహన కల్పిస్తున్న సర్పంచ్



తాంసి: ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ, అధికారులు



ఉట్నూర్‌రూరల్: ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీవో సురేశ్



సిరికొండ: అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఓటుహక్కు వజ్రాయుధం లాంటిందని ఆర్డీవో సురేశ్ అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఐబి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వృద్ధ ఓటర్లను ఆర్డీవో, ఎంపీపీ జైవంత్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో తిరుమల, బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఓటుహక్కు ప్రతిజ్ఞ చేశారు. ఓటరు నమోదు, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్, ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ఆర్ఐలు గీత, నారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేష్, కారోబారి కల్యాణకార్ గజానన్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, ఎంపీడీవో సునీత, ఎస్సై ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్, గేడం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమని ముఖర(కె) సర్పంచ్ గాడ్గె మీనాక్షి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గ్రామంలో ఎడ్లబండ్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువను తెలుసుకుని అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గె సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో..

జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోహన్‌సింగ్ మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, అర్హులైన యువత ఓటు హక్కు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఎంపీపీ ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి, తలమడుగు, కుచులపూర్, బరంపూర్, కజ్జర్ల గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, హెచ్‌ఎం శ్యాంసుందర్ పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, గంగన్న, రవీందర్ పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ఓటర్లుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫారాజ్ నవాజ్, సర్పంచ్ ఓరగంటి నర్మద, రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తాంసి: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు కీలకమని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కుగా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో భూమయ్య, ఎస్సై ధనశ్రీ, సర్పంచ్ కృష్ణ, అటవీ సెక్షన్ అధికారి ప్రేంసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నార్నూర్: ఓటుహక్కు ప్రతీ ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్, గాదిగూడ తహసీల్దార్ ఆర్కా మోతీరాంలు అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్స సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాదిగూడ మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అమృత్‌లాల్ డిప్యూటీ తహసీల్దార్ నీలాబాయి, సీనియర్ అసిస్టెంట్, రాథోడ్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సురేందర్, తహసీల్ కార్యాలయ సిబ్బంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నేరడిగొండ: యువత దేశాభివృద్ధికి పాటుపడాలని తహసీల్దార్ పవన్‌చంద్ర అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల నిండిన వారు ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో శోభన, ఆర్ఐ నాగోరావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కైలాసనగర్: అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కట్టా రమేష్ కుటుంబానికి పట్టణ స్వర్ణకార సంఘం, బులియన్ అసోసియేషన్ అండగా నిలిచింది. ఆయా సంఘాల ద్వారా పోగు చేసిన రూ.లక్ష నగదును బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఇందులో రామోజీ అంజనేయులు, ఆనసూరి గోపి, కట్టు సత్యం, సామనపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.